# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 తేదిః 2-9-2014

తెలంగాణలో స్థాపించే విద్యుత్ ప్రాజెక్టుల కోసం రూ.20 వేల కోట్ల రుణం మంజూరు చేయడానికి రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పోరేషన్ (ఆర్ఇసి) ముందుకొచ్చింది. ఆర్ఇసి సిఇవో రాజీవ్ శర్మ, జెన్ కో సిఎండి ప్రభాకర్ రావు సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావును కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో స్థాపించబోయే విద్యుత్ ప్రాజెక్టులు, దానికయ్యే వ్యయం, వనరుల సమీకరణ తదితరణ అంశాలపై సమీక్ష జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో నీటి పారుదల ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఐటిఐఆర్ ప్రాజెక్టు, మంచినీటి గ్రిడ్ తదితర కార్యక్రమాలు చేపట్టనున్నదున ఇప్పటికన్నా ఎక్కువ కరెంటు డిమాండ్ భవిష్యత్తులో ఎక్కువ ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికనుగుణంగానే తెలంగాణలో ప్రస్తుతమున్న 8 వేల మెగావాట్ల సామర్థ్యమున్న విద్యుత్ ప్లాంట్లకు అనుబంధంగా మరో 12 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చే విధంగా ప్రణాళిక రూపించినట్లు వెల్లడించారు. తక్షణం విద్యుత్ సమస్యలు అధిగమించడానికి స్వల్పకాలిక వ్యూహం, రాబోయే కొద్ది సంవత్సరాల అవసరాలు తీరేందుకు మధ్యతరహా కార్యక్రమాలు, రాబోయే పది పదిహేనేళ్ల పాటు విద్యుత్ కోత లేకుండా ఉండే దీర్ఘకాలిక కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6,700 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంటే, 4417 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉందని అధికారులు వెల్లడించారు. చత్తీస్ గఢ్ నుంచి వెయ్యి మెగావాట్ల, పిపిఎల ద్వారా మరికొంత విద్యుత్ సమకూర్చుకుంటున్నట్లు అధికారులు చెప్పారు.

భూపాలపల్లి కెటిపిఎస్, జైపూర్ సింగరేణిలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల విస్తరణకు సంబంధించిన పనులను కూడా సమీక్షించారు. వచ్చే ఏడాది చివరకు 2800 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చే విధంగా అధికారులు యుద్ధప్రాతికన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూపాలపల్లిలో వచ్చే ఏడాది ఆగస్టు నాటికి 600 మెగావాట్ల విద్యుత్, ఆదిలాబాద్

జిల్లా జైపూర్ ప్లాంటు ద్వారా సింగరేణి నుంచి 1200 మెగావాట్లు వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి, కేంద్రం వాటాకింద రావాల్సిన 1000 మెగావాట్లు వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇవి అందుబాటులోకి వస్తే తెలంగాణలో విద్యుత్ కొరతను కొంతమేరకు అధిగమించవచ్చని కూడా ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

--------------------------------------------------------------------------------

సిపిఆర్ టూ సిఎం